# మిడతలు

గుంపులు గుంపులుగా ఎగురుతూ పంటలకు చెట్లకు నష్టాన్ని కలిగించే మిడతలు, ఇశ్రాయేలుతో సహా ప్రాచీన పశ్చిమాసియాలో ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం పశువుల పెంపకం గనుక మిడతల వల్ల కలిగే నష్టాలు అపారం. మిడతల దండ్లు పంటలను మొక్కలను హరించి వేసినట్లయితే ఆహారధాన్యాలు ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు పాడిపశువులు కరవుతో అల్లాడవలసిందే. ఆకలితో నీరసించిన ప్రజలకు పాడిపశువులకు చచ్చిన మిడతల వలన కలిగే వ్యాధులు వెంటనే సోకేవి.

ఆధునిక కాలంలోకూడ మిడతలు ఒక సమస్యే. మిడతలు పొలాల్లో గ్రుడ్లుపెట్టి పొదుగుతూ వుంటాయి. ఒక్కొక్క ఆడ మిడత వందల కొలదీ గ్రుడ్లను పెడుతుంది. గ్రుడ్ల నుంచి బయటకి వచ్చిన కీటకాలకు మొదటి దశలో రెక్కలుండవు. రెండవ దశలో రెక్కలు వస్తాయి. మూడవదశలో కొరకడానికి వీలుగా వుండే కత్తెరలాంటి పండ్లు ఏర్పడతాయి.చివరి దశలో అన్ని అవయవాలతో పూర్తి కీటకంగా మిడత రూపుదాల్చుతుంది. నాల్గవ దశలోవున్న మిడతల ఎంత దూరమైనా ఎగరగలవు. మిడతల దండ్లు చాలా విస్తీర్ణంలో ఎగురుతూ వెళ్తుంటాయి. 1881లో సైప్రసలో దాదాపు పదమూడు వందల టన్నుల మిడతల గ్రుడ్లను నాశనం చేసి మిడతల దాడిని అరికట్ట గలిగారు. 1889లో ఎఱ్ఱ సముద్రాన్ని దాటి వెళ్ళిన మిడతల దండులో సుమారు పండ్రెండు కోట్ల మిడతలున్నాయి. ఈ మిడతల దండు విస్తీర్ణం రెండువేల చదరపు మైళ్ళు.

ఈజిప్టు మీదకు యెహోవా పంపిన మిడతల తెగులు ఎంత భయంకరమైనదో ఇక ఊహించండి. (నిర్గమ 10:4-19). మిడతల దండు మేఘంలాగా సూర్యునికి అడ్డం నిలచి పట్టపగలే చీకటి కమ్మేలా చేయగలదు (యూవేలు 2:10). దేశం మీద మిడతల దాడి చేసినప్పుడు తాను పెట్టే మొరను వినమని ఇశ్రాయేలు రాజైన సొలొమోను ప్రార్థించాడు (1 రాజులు 8:37: 2 దిన 6:28). మిడతల దండు వల్ల వాటిల్లే ముప్పు చాలా తీవ్రమైంది కాబట్టి యోవేలు ప్రవక్త మిడతల దండును శత్రుసైనికుల దాడితో పోల్చాడు (యోవేలు 2:1-11). తనను తృణీకరించినవారికి యెహోవా విధించే శిక్షలో మిడతలు కూడ ఒక భాగమే (ద్వితీ 28:36-42: అమోసు 4:9:7:1).